## కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానం

ఎదులాపురం, మే 15 : కార్పొరేట్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్సీడీవో భగత్ సునీతాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగుల విద్యార్థులు కార్పొరేట్‌లో (ఇంటర్) కళాశాలలో ప్రవేశ పొందుటకు పదో తరగతి వార్షిక పరీక్షలలో 7.0 సీజీపీఏ,(400)మార్కులు, ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు ఈ నెల 17నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారికి మెరిట్ ఆధారంగా(సీజీజీ అన్‌లైన్ ఆటోమెటిక్ సిస్టమ్)ద్వారా ఎంపిక చేసి ప్రవేశాలు కల్పించబడుతుందన్నారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్ WWW.telanganaepass.cgg.gov.in లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## భూములను ఆక్రమిస్తే సహించం

బోథ్, మే 15: ఎస్సీ, ఎస్టీ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా సొనాలలోని దళితుల శ్మశాన వాటిక, బౌద్ధ విహార ప్రాంత భూమిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొనాలలో దళితుల భూమిపై ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అన్నెల లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్, సొనాల మండలాధ్యక్షుడు గణేశ్, నాయకులు శ్రీనివాస్, అశోక్, చింటూ, నరేశ్, రాకేశ్ పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాల వైపు పయనించాలి

ఉట్నూర్, మే 15: విద్యార్థులు లక్ష్య సాధన కోసం కఠోర శ్రమ, ఉన్నత లక్ష్యాల వైపు పయనించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. క్రీడాపాఠశాలను జూనియర్ కళాశాలగా ప్రమోట్ చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో నేచురల్‌గా పండించిన మామిడి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీడీ అంబాజీ, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఆత్రం భాస్కర్, క్రీడాధికారి పార్థసారధి, ఉత్తమ్, గంగారాం, కోచ్‌లు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఎన్జీవోలు నిధుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఉట్నూర్, మే 15: ఆదిలాబాద్ జిల్లాలోని షెడ్యూల్ తెగల విద్య, ఆరోగ్యం కోసం పని చేస్తున్న ప్రభుత్వేతర సంస్థలు(నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్స్), స్వచ్ఛంద సంస్థలు(వాలంట్రీ ఆర్గనైజేషన్స్)లు గ్రాంట్ ఇన్ ఏయిడ్ 2025-26 సంవత్సరం మంజూరు కోసం ఆన్‌లైన్ పోర్టల్ www.ngograntsmota.gov.inలో నమోదు చేసుకొనుటకు అవకాశం కల్పించారన్నారు. ఆరోగ్యం, విద్య, జీవనోపాధి కోసం పని చేయుచున్న సంస్థలు ఈ నెల 16 నుంచి జూన్ 30లోపు పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి

నార్నూర్, మే 15 : లంబాడీలకు కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భారత్ చౌహాన్ డిమాండ్ చేశారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టీ సర్టిఫికెట్ కోసం అధికారులకు విన్నవించినప్పటికీ 1950 నుంచి సంబంధిత రికార్డులు అడిగి ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. బేల మండలంలో 45మందిపై ఎల్టీ కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. లంబాడీలకు కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చి న్యాయం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సేవాలాల్ ఉత్సవ సమితి అధ్యక్షుడు మధుకర్, టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

## ఇచ్చోడ అగ్నిమాపక శాఖ అధికారిగా ఎండీ రఫీ

ఎదులాపురం, మే 15 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ అగ్నిమాపక శాఖ అధికారిగా ఎండీ రఫీ బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ అగ్నిమాపక కేంద్రం నుంచి ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. 2008లో డ్రైవర్‌గా ఉద్యోగంలో చేరిన అతను బోధన్, నిజామాబాద్, ఆర్మూర్, బాన్సువాడ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PASSPORT LOST
నేను దాసరి వినయ్‌కుమార్ తండ్రి సత్తయ్య, ని॥ రేవోజీపేట్ గ్రామము, మం॥ దస్తురాబాద్, జిల్లా: నిర్మల్, T.S., నా యొక్క పాస్‌పోర్ట్ నెంబర్ S0713614 తేది: 25-02-2025 రోజున రేవోజీపేట్ నుండి దస్తురాబాద్‌కు బైక్ పై ప్రయాణిస్తుండగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు సంప్రదించు సెల్ నెంబర్: 95506 66447.

DOCUMENTS LOST
నా పేరు వరగంటి ప్రవీణ్ తండ్రి వరగంటి అశోక్, ని॥ అకోలి గ్రామము, మం॥జైనథ్, జి॥ ఆదిలాబాద్. నా యొక్క ప్లాటు ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్ 3146/2025 రిజిస్టర్ JSRO ఆదిలాబాద్ అయితే దానికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ నెం. 7482/2011 తేది: 08.05.2025 రోజు ఉదయం పిట్టలవాడ నుండి దస్నాపూర్‌కు ఆటోలో ప్రయాణించగా ఎక్కడో పడిపోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించు సెల్ నెం. 80743 68554, 9440012163.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677



నార్నూర్ మార్కెట్‌కు విక్రయించేందుకు వాహనాల్లో తీసుకువచ్చిన జొన్న



జొన్న కొనుగోలు కేంద్రం వద్ద తుకాం వేసేందుకు ఇబ్బంది పడుతున్న రైతులు

# 'ఉప మార్కెట్' లో సౌకర్యాలు కరువు

### ఇబ్బందుల్లో రైతులు

నార్నూర్, మే 15 : నార్నూర్‌లోని ఉప మార్కెట్‌యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నార్నూర్, గాదిగూడ మండల కేంద్రాలకు చెందిన రైతులు జొన్న పంటను విక్రయించేందుకు వాహనాలపై కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తున్నారు. మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడాల్సి వస్తున్నది. పంటను నిల్వ చేసేందుకు షెడ్డు లేకపోవడంతో పంటను వాహనంలోనే ఉంచే దుస్థితి నెలకొంది. వాతావరణంలో మార్పులు కనిపిస్తుండడంతో వర్షాలు కురిస్తే పంటను ఎక్కడ పెట్టాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం నిల్వ నీడలేకపోవడంతో చెట్ల కింద సేద తీరుతున్నారు. ఇప్పటికైనా మార్కెటింగ్‌శాఖ అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

# ఉద్యోగోన్నతితో బాధ్యత పెంపు



ఉద్యోగోన్నతి పొందిన ఏడుగురు హెడ్‌కానిస్టేబుళ్లతో ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, మే 15 : ఉద్యోగోన్నతితో బాధ్యత మరింత పెంపొందుతుందని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్‌లోని జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ఏఆర్ విభాగానికి చెందిన ఏడుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగోన్నతి లభించింది. ఉద్యోగోన్నతి పొందిన అధికారులు ఎన్ కిషన్‌రావు, ఎం అశోక్, జే దుదిరామ్, ఆర్ గోవింద్, ఎల్ దినేశ్, ఎన్ అరవింద్, ఆర్ రామారావులను పోలీసు ముఖ్య కార్యాలయానికి ఆహ్వానించారు. వారి భుజాలకు ఎస్పీ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి అభినందనలు తెలిపారు. వీరిని నిర్మల్, జగిత్యాల జిల్లాలకు ఖాళీలకు అనుగుణంగా బదిలీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బీ సురేందర్ రావు, సీసీ కొండరాజు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్రీయ విశ్వవిద్యాలయం కోసం స్థలం, తాత్కాలిక భవనం పరిశీలన

బాసర, మే 15 : నిర్మల్ జిల్లా బాసరలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగానే గురువారం కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు స్థలం, తాత్కాలిక భవనాన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయ డిప్యూటీ కమిషనర్ డా. మంజూనాథర్, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ పరిశీలించారు. విద్యార్థులకు సౌకర్యంగా ఉండే తాత్కాలిక భవనం, అనువైన స్థలం కావాలని కమిషనర్ తెలిపారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనురాధ, నిర్మల్ ఆర్డీవో రత్నమాల, జిల్లా విద్యాశాఖ అధికారి వసంతరమేశ్, మాజీ ఎంపీపీ విశ్వనాథ పటేల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సతీశ్‌రావు, నాయకులు ఉన్నారు.

### రైతు గుర్తింపు కార్డుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ఇచ్చోడ, మే 15 : కేంద్ర ప్రభుత్వం జారీ చేయనున్న రైతు గుర్తింపు కార్డు కోసం ఇచ్చోడ క్లస్టర్‌లోని రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఇచ్చోడ క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారి సంజీవ్ నాయక్ అన్నారు. రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్ నంబర్, ఆధార్ కార్డును, ఫోన్ నంబర్‌కు లింక్ చేసుకోవాలన్నారు. ఫోన్ నంబర్ తమ ఆధార్‌కు లింకై ఉండాలన్నారు. రైతులు ఏఈవోల వద్ద, మీ సేవ కేంద్రాల్లో గాని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. జూన్ 6 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

### గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

సోన్, మే 15: నిర్మల్ మండలంలోని కొండాపూర్ గ్రామం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. కడెం మండలం అల్లంపల్లి గ్రామానికి చెందిన బదలనూర్‌సింగ్ నిర్మల్‌కు ఆటోలో గంజాయి తరలిస్తుండగా ఏఎస్ఐ బాబారావు, హెచ్‌సీ రాజేశ్వర్, పీసీ కలిసి ఆటోను తనిఖీ చేయగా అతని వద్ద నుంచి సుమారు 1,907 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ లింబాద్రి తెలిపారు.

### కేజీబీవీలో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

ఎదులాపురం, మే 15 : ఆదిలాబాద్ రూరల్ (బంగారిగూడ)కు చెందిన కేజీబీవీలో 2025-26 విద్య సంవత్సరానికి ఇంటర్ సెక్షన్ అవ్వడం జరిగిందని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ జాదవ్ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరంలో ఇంగ్లిష్ మీడియంలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్టీ), బైపీసీ కోర్సులో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 7989383104ను సంప్రదించాలని సూచించారు.

### దేశభక్తిని అలవర్చుకోవాలి

భైంసా, మే 15 : దేశభక్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ప్రముఖ వ్యాపార వేత్త సంతోష్ అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా భైంసాలోని వివేకానంద ఆవాసంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వేసవి శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి సమాజంపై ఏ ఆపద వచ్చిన ముందు వరుసలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రతాప్, శైలేశ్ మాశెట్టి వార్, అశోక్ పాల్గొన్నారు.

### గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యం

ముథోల్, మే, 15 : గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని రాంటెక్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 20 లక్షలు కేటాయించామని తెలిపారు. దీంతో పాటు మండపం, షెడ్డు కోసం రూ.5లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు శివాలయ సమీపంలో నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీమంత్రి జోగు రామన్న

ఎదులాపురం, మే 15: ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న కోరారు. గురువారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన కళాశాలలు, ఇతరత్రా అభివృద్ధి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాలకు స్థలం కేటాయించడంతో పాటు ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా బేల, ఇచ్చోడ మండలాల పరిధిలో మార్క్‌ఫెడ్ ద్వారా శనగ అమ్మిన పలువురు రైతులకు ఇప్పటికీ డబ్బులు జమ కాలేదని, వెంటనే రైతులకు నగదు జమ చేసి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. మార్కెట్ యార్డ్‌లో రైతులకు భద్రత కల్పించాలన్నారు. జైనథ్ మండలంలో 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో తీవ్ర జాప్యం జరుగుతోందని, వెంటనే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు ఉన్నారు.

### బాధితులకు పరామర్శ

జైనథ్, మే 15 : జైనథ్ మండలంలోని సాంగ్వి గ్రామానికి చెందిన తన మిత్రుడు పురుషోత్తం రెడ్డి గుండె పోటుకు గురై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీమంత్రి జోగు రామన్న అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం దీపాయిగూడకు చెందని కృష్ణాకర్ రెడ్డి మామ అనిల్ రెడ్డి మృతి చెందగా మహారాష్ట్రలోని క్వినట్‌లోని వారి గ్రామం దొంగలింగికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మెట్టు ప్రహ్లాద్, శ్రీనివాస్ రెడ్డి, ఉమాకాంత్, గణేశ్ రెడ్డి, రూపేశ్, నాగన్న ఉన్నారు.

## కొత్త రేషన్ కార్డు జాబితా పరిశీలన చేయాలి



ఒకటో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

ఇంద్రవెల్లి, మే 15: కొత్తగా మంజూరైన రేషన్ కార్డు జాబితాను పకడ్బందీగా పరిశీలన చేయాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని ప్రధాన్‌గూడకు చెందిన ఒకటో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. పంపిణీ చేసిన బియ్యం వివరాలు పరిశీలించారు. నిలువ ఉన్న బియ్యం వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కొత్తగా మంజూరైన రేషన్ కార్డుల కొత్త జాబితాను పరిశీలించి పేర్లు మార్పులు, చేర్పుల వివరాలు పరిశీలించారు. జాబితాపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ మెస్రం లక్ష్మణ్, అధికారులు పాల్గొన్నారు.

## టీబీని అంతం చేద్దాం

ఎదులాపురం, మే 15: రానున్న ఐదు సంవత్సరాల్లో టీబీని అంతం చేద్దామని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ అన్నారు. గురువారం ఆదిలాబాద్‌లోని రిమ్స్ మెడికల్ కాలేజ్ సమావేశ మందిరంలో ఎంఈయూ యూనిట్‌లో ఎన్‌టీఈపీ జాతీయ క్షయవ్యాధి నిర్మూలన (టీబీ ముక్త్ భరత్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ నేటి యువతలో టీబీపైన అవగాహన చాలా ముఖ్యమన్నారు. అనంతరం జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ సీ సుమలత మాట్లాడుతూ టీబీ రోగులకు ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నాణ్యమైన మందులు, చికిత్స సమయంలో నెలకు రూ.500 ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. టీబీ గురించి అవగాహన కల్పించడానికి కరపత్రాలు, వీధి నాటకాలు, ఆరోగ్య ఉత్సవాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు సరోజ, విద్య విల్సన్, వైస్ ప్రిన్సిపాల్ రిమ్స్ వైద్యులు సందీప్, ప్రొఫెసర్, రెస్పెటరీ మెడిసిన్,డాక్టర్ పద్మావాలి, సిబ్బంది పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూం ఇండ్లలోకి చొరబడ్డ గ్రామస్తులు



ఆందోళన చేస్తున్న మహిళలను లాక్కెళ్తున్న పోలీసులు

నర్సాపూర్ (జీ), మే 15 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లలోకి గురువారం లబ్ధిదారులు, గ్రామస్తులు చొరబడ్డారు. వివరాలిలా ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించింది. లబ్ధిదారులను కూడా ఎంపిక చేసింది. కానీ.. పంపిణీ ప్రక్రియ చేపట్టేనాటికి అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆగిపోయింది. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగా.. ప్రజాపాలనలో మళ్లీ లబ్ధిదారుల ఎంపిక కోసం దరకాస్తులు స్వీకరించారు. ఈ క్రమంలో గురువారం లబ్ధిదారులు, గ్రామస్తులు, మహిళలు ఒకేసారి 50 మంది వరకు డబుల్ బెడ్రూం ఇండ్ల తాళాలు పగల గొట్టి సామగ్రిలో లోపలికి వెళ్లారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. చివరకు వారిని బయటకు పంపించి, ఇండ్లకు తాళాలు వేశారు. ఈ క్రమంలో పోలీసులకు, లబ్ధిదారులు, గ్రామస్తులు, మహిళల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. మీరు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో తిరుపతి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్ని సార్లు అప్లికేషన్లు పెట్టుకోవాలి? మేము పెట్టుకోము. ఇక్కడే ఉంటాం. మీ ఇష్టం సారు మీరు వెళ్లండి.. మా చావు మేము చస్తాం' అని మహిళలు అధికారులను నిలదీశారు. మేము అప్లికేషన్ ఇస్తాం. మాకు మీరు ఒక నెల సమయం పడుతుంది. రెండు నెలలు పడుతుంది. అని ఒక అంగీకారం ఇవ్వండి. అప్పుడు ఒప్పుకుంటాం. లేదంటే మేము ఒప్పుకోం అని అనడంతో మీ ఇష్టం అని చెప్పి అధికారులు వెళ్లిపోయారు. దీంతో వారు కూడా చేసేదేమి లేక రాత్రి వరకు చూసి వెళ్లిపోయారు.

## అనుమానితుడి ఫొటో విడుదల చేసిన పోలీసులు

ఎదులాపురం, మే 15 : ఆదిలాబాద్ జిల్లా మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దస్నాపూర్‌కు చెందిన సరస్వతి అనే వృద్ధురాలి నగలు కాజేసిన అనుమానితుడిని గుర్తించినట్లు ఎస్ఐ విష్ణు వర్ధన్ తెలిపారు. సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా అనుమానితుడిని హైదరాబాద్‌లోని యాకూబ్ పురకు చెందిన షేక్ అల్తాఫ్ అలీయాస్ అహ్మద్ బిస్మిల్లా షేక్‌గా గుర్తించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే మావల పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.



పోలీసులు విడుదల చేస్తున్న అనుమానితుడి ఫొటో

## గంజాయి విక్రేత అరెస్ట్

తాంసి(భీంపూర్), మే 15: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ బస్‌స్టాప్ వద్ద గురువారం పోలీసులు తనిఖీ చేశారు. జైనథ్ మండలంలోని సాత్నాల గ్రామానికి చెందిన యాసిన్ గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద రూ.12,500 విలువ గల 500 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకుని ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అరెస్ట్ చేసి రిమాండ్ పంపుతున్నట్లు సీఐ సాయినాథ్, ఎస్ఐ పీర్‌సింగ్ తెలిపారు. దాడిలో భీంపూర్ పోలీసులు, సిబ్బంది ఉన్నారు.

## కరపత్రాలు విడుదల

ఖానాపూర్ రూరల్, మే 15: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ సెకండరీ పాఠశాలకు చెందిన విద్యార్థుల ఫలితాల కరపత్రాలను కలెక్టర్ అభిలాష అభినవ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా కరపత్రాలలో ఉన్న విషయాన్ని కలెక్టర్ ఆసక్తిగా చదివి ఉపాధ్యాయులను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భోనగిరి నరేందర్, కుర శేఖర్, వెన్నం అంజయ్య, షేక్ ఇమ్రాన్, కిషన్, ప్రసాద్, రవి పాల్గొన్నారు.

## 'భూ భారతి'తో సమస్యలు పరిష్కారం

జైనథ్, మే 15: రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం భోరజ్ మండలంలోని రాంపూర్(టీ) గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. రైతులు భూ సమస్యలను రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి పాల్గొన్నారు.

### దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ముథోల్, మే 15 : నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో జరిగిన ఘటనలో దళితులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ముథోల్‌లోని నాగార్జున నగర్‌లో గల దళిత సంఘాల నాయకులు బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బోరిగాం గ్రామంలో బుద్ధ విగ్రహాన్ని అధికారులు తొలగించడం సరికాదని అన్నారు. వెంటనే అదే స్థలంలో బుద్ధ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దాడిలో గాయపడ్డ మహిళలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయాలని వారు కోరారు. ఈ ఘటనలో అరెస్టు అయిన దళితులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సమతా సైనిక్ దళ్ ఉపాధ్యక్షుడు నారాయణ వాగ్మారే, భీం ఆర్మీ నిర్మల్ జిల్లా మాజీ అధ్యక్షుడు హూజేకర్ ప్రకాశ్, సమతా సైనిక్ దళ్ ముథోల్ మండలాధ్యక్షుడు విశ్వంబర్, నాయకులు శ్రావణ్, శంకర్, గంగాధర్, కీర్తి రత్న, రాహుల్ పాల్గొన్నారు.

### రసాయన మందుల వాడకం తగ్గించాలి

బేల,మే15: రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి శాస్త్రవేత్తలు సూచనల ప్రకారం యాజమాన్య పద్ధతులలో వ్యవసాయం చేసి తక్కువ ఖర్చులతో లాభాలు పొందాలని శాస్త్రవేత్త డా.శివ చరణ్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని చెప్రాల గ్రామంలోని రైతు వేదికలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంనిర్వహించారు. శాస్త్రవేత్తలు పలు అంశాల్లో రైతులకు పంటల యాజమాన్య పద్ధతులపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ జశేఖర్, డా.జీ శివచరణ్, బేల మండల వ్యవసాయ అధికారి సాయితేజ, సీపీఎఫ్ స్వచ్ఛంద సంస్థ అధికారి సత్యం, వ్యవసాయ విస్తరణ అధికారులు, చెప్రాల క్లస్టర్ రైతులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



దస్తురాబాద్ : ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

దస్తురాబాద్, మే 15 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని మున్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో 2008-09 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సమ్మేళనాన్ని నిర్వహించారు. అప్పట్లో కి చదువు నేర్పిన గురువులను శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అలాగే మిత్రురాలు ఒకరు మరణించాగా ఆమె కుమారుడుకి తోటి మిత్రులు కలిసి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

## ఆయిల్ పామ్‌పై అవగాహన సదస్సు

ముథోల్, మే 15 : నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని మచ్కల్ గ్రామంలో డివిజన్ ఏరియా మేనేజర్ ఆడెపు శంకర్ గురువారం ఆయిల్ పామ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ ద్వారా కొత్తగా నాటుకునే రైతులకు రాయితీలు ఉంటాయని తెలిపారు. ఆయిల్ పామ్‌తో అధిక దిగుబడులు సాధించి రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని పేర్కొన్నారు. వీటి కొనుగోలు కేంద్రాలు మండలంలోనే ఉంటాయని పేర్కొన్నారు. రైతులు ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఆయిల్ ఫామ్ క్లస్టర్ ఆఫీసర్ మోహిన్ మియ్యా, రైతులు గంగాధర్ పటేల్, చక్రధర్ పటేల్, దీపక్, దత్తు పాల్గొన్నారు.

## నిబంధనల మేరకు కొనుగోళ్లు జరపాలి

కుంటాల, మే 15 : నిర్మల్ జిల్లా కుంటాలలోని ఓ వడ్ల కొనుగోలు కేంద్రంలో ఎక్కువ తూకం వేస్తున్నారని, హమాలీల సమస్య, కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నాయని, ధాన్యం కల్లాల్లో ఉండడంతో అకాల వర్షాల వల్ల నష్టపోతున్నామని నమస్తే తెలంగాణలో గురువారం ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ కమల్ సింగ్ స్పందించారు. తహసీల్దార్ ఆదేశాలతో అదే రోజు సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రానికి వెళ్లి రైతుల నుంచి వివరాలు సేకరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సక్రమంగా కొనుగోళ్లు జరపాలని ఎప్పటికప్పుడు తూకం వేసిన ధాన్యాన్ని తరలించాలని సెంటర్ ఇన్‌చార్జీలకు సూచించారు. డీఆర్డీవో విజయలక్ష్మి, పౌర సరఫరాల శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు కూడా మండలంలోని కల్లూరు, కుంటాల ధాన్యం కొనగోలు కేంద్రాలు తనిఖీ చేశారు. దీంతో సంతృప్తి చెందిన రైతులు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకవచ్చి పరిష్కరింపజేసిన నమస్తే తెలంగాణకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## మున్నూరు కాపు సంఘం సమావేశం

ఎదులాపురం, మే 15 : రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఎన్నికల కమిటీ సూచనల మేరకు ఎన్నికల నియమ నిబంధనలు తెలిపేందుకు గురువారం ఆదిలాబాద్‌లోని మున్నూరు కాపు సంఘ భవనంలో సమావేశం నిర్వహిచారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య పాల్గొని ఎన్నికల నియమావళిని తెలిపారు. కార్యక్రమంలో తాలూకా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కాళ్ల విఠల్, ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## దేశీదారు సీసాలు తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

భీంపూర్, మే 15 : దేశీదారు తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రేండ్ల విజేందర్ తెలిపారు. నిఘవర్గాల సమాచారం మేరకు ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని అర్లి(టీ) గ్రామంలో అశోక్ అనే వ్యక్తి దేశీదారు అమ్ముతున్నాడు. మహారాష్ట్ర నుంచి ద్విచక్రవాహనంపై 90ఎంఎల్ దేశీదారు 68 సీసాలతో తరలిస్తున్న క్రమంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద ద్విచక్రవాహనం, 90ఎంఎల్ దేశీదారు 68 సీసాలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

### పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు..

ఎదులాపురం, మే 15 : మద్యం మత్తులో పోలీసులతో వాగ్వాదానికి దిగి గొడవ పడ్డ వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వన్ టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..ఆదిలాబాద్‌లోని అంబేద్కర్ నగర్‌కు చెందిన మోసిన్ ఖాన్ అనే వ్యక్తి పెట్రోల్ బంక్ వద్ద పోలీసులతో గొడవ పడి విధులకు ఆటంకం కలిగించాడు. సదరు నిందితుడిని గురువారం అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

### మహిళతో అనుచిత ప్రవర్తించినందుకు..

ఎదులాపురం, మే 15 : ఆదిలాబాద్‌కు చెందిన ఓ మహిళను బైక్‌పై తీసుకెళ్లి పెళ్లి చేసుకోడానికి బలవంతం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. స్థానిక శాంతినగర్‌కు చెందిన మొహమ్మద్ ఉమర్ ఓ మహిళను బలవంతంగా బైక్‌పై తీసుకెళ్లి పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో బాధితురాలి కుటుంబీకులు ఆమెను వెతుకుతున్నారని తెలియడంతో వదిలేసి పారిపోయాడు. సదరు వ్యక్తిని ఇంటి వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

### వేర్వేరు కారణాలతో ముగురు ఆత్మహత్య

తానూర్, మే 15 : నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని మహాలింగి గ్రామానికి చెందిన జాదవ్ మయావతి (35) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ట్రైనీ ఎస్ఐ నవనీత్‌రెడ్డి తెలిపారు. ట్రైనీ ఎస్ఐ, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం మయావతి భర్త గౌతం కూలీ పని చేసుకుని ఇంటికి వచ్చి భార్య మయావతిని వంట చేయుమని చెప్పాడు. మయావతి వంట చేయక పోవడంతో గౌతం అన్నం తినక ఇంటి బయట పడుకున్నాడు. ఉదయం లేచి కూలీ పనికి వెళ్లాడు. క్షణిక ఆవేశంలో గురువారం ఉదయం మయావతి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త గౌతం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీఎస్ఐ తెలిపారు.

ఖానాపూర్ రూరల్, ఏప్రిల్,24: ఓ యువకుడు మద్యం మత్తులో తల్లితో గొడవపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్‌గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాత ఎల్లాపూర్‌కు చెందిన ఎనగందుల శేఖర్ (20) ఇంట్లో ఉన్న దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండు నెలల క్రితం దుబాయి నుంచి వచ్చిన శేఖర్ ప్రతి రోజు మద్యం తాగడంతో ఇంట్లో తరుచుగా గొడవలు జరిగేవి. బుధవారం అర్ధరాత్రి దూలానికి ఉరివేసుకోవడంతో చికిత్స నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉట్నూర్ రూరల్, మే 15: ఉట్నూర్‌లోని కొమ్ముగూడ గ్రామానికి చెందిన రాథోడ్ మధుకర్(40) గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ పూజ తెలిపిన వివరాల ప్రకారం.. మధుకర్ రోజు మద్యం తాగడంతో భార్య మందలించేది. ముగ్గురు కూతుర్లలో పెద్ద కూతురు వివాహం చేయగా 5 లక్షల అప్పు అయింది. అప్పు తీర్చడం గురించి ఆవేదన చెందుతూ మద్యం తాగేవాడు. ఎప్పటి లాగే గురువారం ఆదిలాబాద్ నుంచి వచ్చి ఎవరు లేని సమయంలో మద్యం మత్తులో ఉరివేసుకున్నాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.